క్లుప్తంగా

పోచమ్మతల్లికి కుమ్మరుల మొదటి బోనం



మడికొండ: 46వ డివిజన్ పాత పోలీసుస్టేషన్ వద్ద ఉన్న పోచమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అనంతరం కుమ్మరులు మొదటి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. బుర్ర రాజుగౌడ్, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, గాండ్ల భిక్షపతి, కొలిపాక వెంకటస్వామి, బొల్లికొండ వినోద్, అర్చకులు వెంకట ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

క్యూబాకు మద్దతుగా నిధి సేకరణ



కాజీపేట: అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్యూబా ప్రజలు చేస్తున్న పోరాటం తమ దేశ కార్మికులకు స్ఫూర్తిదాయకమని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. ఈ మేరకు క్యూబాకు మద్దతుగా సంఘీభావ నిధిని కాజీపేట చౌరస్తాలో శుక్రవారం సేకరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు బొల్లారం సంపత్, అలకుంట యాకయ్య, డి.సమ్మయ్య, మనక్షమర్, కొమ్ము రవి, జి.యేసు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



రామన్నపేట: మైనార్టీ గురుకులంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అజ్మీరాబేగం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని ముస్లిం ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు శుక్రవారం పరామర్శించి, రూ.28 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ముస్లిం ఉద్యోగుల సంక్షేమం కోసం ఈ సంక్షేమ సంఘం నిరంతరం పాటు పడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు షఫి మహ్మద్, ప్రధాన కార్యదర్శి మాషిబ్, డిప్యూటీ తహసీల్దార్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులైన ఒంటరి మహిళలకు కుట్టు మిషన్లను శుక్రవారం ఉచితంగా పంపిణీ చేశారు. హెల్పింగ్ హార్ట్స్ రామకృష్ణ ఆధ్వర్యంలో సిన్సినాటి ఫ్రెండ్స్ గ్రూప్ సౌజన్యంతో కుట్టు మిషన్లను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాక విజయ్‌కుమార్, బిల్లా కోటేశ్వర్, నామోజు శ్రీనివాస్ కందగట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానసకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: వరంగల్ కరీమాబాద్ ప్రాంతానికి చెందిన కొప్పుల మానసకు ఎస్ఆర్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఎస్ఆర్ యూనివర్సిటీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇంప్రూవ్డ్ ఇన్‌ట్రుసన్ డెటిక్షన్ సిస్టం అనే అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి మానసకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ ఎల్ ఎం లియోజోసెఫ్ పర్యవేక్షణలో మానస తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

దివ్యాంగ టీచర్లకు మినహాయింపుపై హర్షం




విద్యారణ్యపురి: 70శాతం వైకల్యం ఉన్న దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సాధారణ బదిలీల నుంచి మినహాయింపునిస్తూ ప్రభుత్వం జీఓ 34ను విడుదల చేసిందని దివ్యాంగుల ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కొల్లు నర్సమ్మ తెలిపారు. ఈమేరకు హనుమకొండ వడ్డెపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, బోనగిరి రాములు, బాధ్యులు రాధిక, ఉమారాణి, స్వరూప, వెంకటేశ్వర్లు, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

‘పీఎంఎస్‌బీవై’తో ధీమా

రూ.20తో ఇన్సూరెన్స్ సౌకర్యం

కాజీపేట: పేద, మధ్య తరగతి ప్రజలు ప్రమాదాల బారిన పడితే వారిని ఆదుకునేందుకు కేంద్రం 2015లో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనను ప్రవేశపెట్టి అండగా నిలుస్తోంది. పోస్టాఫీసులు, బ్యాంకుల్లోనూ అమలు చేస్తున్న ఈ పథకంపై ప్రజలకు సరైన అవగాహన లేక వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది.



నామమాత్రపు ప్రీమియంతో..

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై)కు నామమాత్రపు ప్రీమియంతో బీమా పొందవచ్చు. ఒకవ్యక్తి మరణిస్తే నామినీకి పరిహారం అందించేందుకు ప్రవేశ పెట్టిన పథకం ఇది. కేవలం రూ.20 ప్రీమియంతో పథకంలో చేరిన వ్యక్తులు ప్రమాదవశాత్తు మరణిస్తే నామినీకి రూ.12 లక్షల బీమా మొత్తాన్ని అందిస్తారు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 10 కింద మినహాయింపులు ఉంటాయి.

10 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వరకు..

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద కొన్ని నియమాలు ఉన్నాయి. 10 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సులోపు ఉన్న వారందరూ ఈ పథకంలో చేరవచ్చు. సాధారణంగా వ్యక్తిగత ఖాతా కలిగిన వారంతా ఈ పథకానికి అర్హులు. అనేక బ్యాంకులు, పోస్టాఫీసుల్లో అధిక ఖాతాలున్నప్పటికీ కేవలం ఒక ఖాతా ద్వారానే అందులో చేరాలి. నేరుగా లేక ఇంటర్నెట్ బ్యాంకింగ్ సదుపాయం ద్వారా కూడా ప్రీమియం చెల్లించి పథకంలో చేరవచ్చు.

అర్హతలు ఏంటంటే?

భారతీయ పౌరుడై ఉండాలి. బ్యాంకు, పోస్టాఫీసుల్లో సేవింగ్ ఖాతాను కలిగి ఉండాలి. ఆ ఖాతా ఆధార్‌తో అనుసంధానమై ఉండాలి. ఆటో రెన్యూవల్ పద్ధతి ద్వారా ఈ స్కీముకు సేవింగ్ ఖాతా నుంచి ఏటా రూ.20 ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది.

క్లెయిమ్ ఇలా..

ఏదైనా సంఘటన జరిగినా పథకం అమలుకు కొన్ని పద్ధతులు అనుసరించాలి. సంబంధిత ఫారాన్ని నింపి బ్యాంకులో ఇవ్వాలి. బీమా పరిహారం మొత్తం పాలసీకి లింకు చేసిన బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తారు. ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి మే 31 వరకు ఏడాది పాటు పాలసీ చెల్లుబాటులో ఉంటుంది. సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి మృతుడికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ కావాల్సి ఉంటుంది.

11న క్రిస్టియన్ల నిరసన శాంతి ర్యాలీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

నయీంనగర్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ క్యాథలిక్, ప్రొటెస్టంట్ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 11న సీబీసీ హనుమకొండ నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు నిరసన శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు కోర్ కమిటీ ప్రతినిధులు బిషప్ దామెర ఐజాక్, పాస్టర్లు ఫ్రాక్లిన్ సుధాకర్, నల్లా డెవిడ్ తెలిపారు. ఈ మేరకు అన్ని క్రైస్తవ సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ 1950, ఆగస్టు 10న జారీ చేసిన రాష్ట్రపతి (ఎస్సీ) ఆర్డర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్ సవరించకపోవడం వలన దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలు రిజర్వేషన్లు, స్కాలర్‌షిప్‌లతో పాటు ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని, దళితులకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, పాస్టర్ అశోక్‌పాల్, బొక్క దయాసాగర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

12న ‘ఆర్యవైశ్య’ మెగా జాబ్‌మేళా



మెగా జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

రామన్నపేట: నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఆర్యవైశ్య మహాసభ, వరంగల్, హనుమకొండ జిల్లాల విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 12న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు నగరంలోని రాధాకృష్ణ గార్డెన్స్ శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మెగా జాబ్ మేళాలో 35 నుంచి 40 కంపెనీలు పాల్గొననున్నాయని, సుమారు 2వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ కార్యదర్శి వంగవీటి అశోక్‌కుమార్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కార్యదర్శి గార్లపాటి శ్రీనివాస్, కోశాధికారి గందె శ్రీనివాస్, రాజకీయ చైర్మన్ పొట్టి శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ హనుమకొండ జిల్లా కార్యదర్శి మోహన్‌రావు, నాగభూషణం, వేణుగోపాల్, వరంగల్ యూత్ అధ్యక్షుడు యాద రవి, వేణు, మురళి, వీరభద్రయ్య, వీరేందర్ పాల్గొన్నారు.

అందరివాడు పండుగ సాయన్న ముదిరాజ్

హన్మకొండ: ముదిరాజ్ జాతిలో పుట్టినప్పటికీ పండుగ సాయన్న అందరివాడిగా గుర్తింపు పొందిన మహానుభావుడని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ కొనియాడారు. హనుమకొండలోని మెపా కార్యాలయంలో పండుగ సాయన్న జయంతిని శుక్రవారం జరుపుకున్నారు. ఈ మేరకు పండుగ సాయన్న చిత్రపటానికి పులి దేవేందర్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించిన రాబిన్ హుడ్.. పండుగ సాయన్న అని అన్నారు. పేదలు, వెనుకబడిన కుటుంబాల సంక్షేమం కోసం పరితపించిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెపా నాయకులు తాళ్ల రవీందర్ ముదిరాజ్, పొన్నం రాజు, దండు చిరంజీవి, నీరటి రాజు, దండు శ్రీనివాస్, పులి రాజేష్, అమ్మగారి శ్యాంసుందర్, నారదాసు దర్శన్, చిరుత వెంకటేశ్వర్లు, పులి ప్రభాకర్, ఇప్పారపు రాజ్ కుమార్, పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర నాయకులు మన్నె చంద్రయ్య పటేల్, నాయక పరమేష్ పాల్గొన్నారు.



సాయన్నకు నివాళులర్పిస్తున్న నాయకులు

ముంపు కాలనీల్లో నాయకుల పర్యటన



గోకుల్‌నగర్‌లో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

హన్మకొండ: భారీ వర్షానికి ముంపునకు గురైన పలు కాలనీలను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సందర్శించారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం హనుమకొండ గోకుల్‌నగర్, అశోక కాలనీలను ముంచెత్తింది. ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో రాత్రంతా ప్రజలు జాగారం చేశారు. ఈ మేరకు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ.శ్రీనివాస్‌రావు, నాయకులు వరద రాజేశ్వర్ రావు, బత్తిని శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నాయకులు సందర్శించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బంక సతీష్, మానుపాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ వైద్య కళాశాలకు శరీర దానం

ఎంజీఎం: నగరంలోని గిర్మాజీపేటకు చెందిన న్యాయవాది కొమ్మినేని ప్రభంజన్‌రావు (67) అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. కుటుంబ సభ్యులు, సోదరి జినుకుల కవిత సహకారంతో అనుమతితో వైద్యవిద్య నిమిత్తం తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కళాశాలకు మృతదేహాన్ని శుక్రవారం అప్పగించారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య ఆదేశాల మేరకు పార్థివ దేహాన్ని అనాటమీ విభాగానికి తరలించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ మరణానంతరం శరీర దానం చేస్తే భావి వైద్యులకు వైద్య విద్య అధ్యయనం కోసం, శాస్త్ర పరిశోధన కోసం, సర్జరీ నేర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. అవయవ, శరీర దానం చేయాలనుకుంటే 87905 48706, 94901 33650 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. వైద్యుడు డాక్టర్ జినుకుల నారాయణరావు, వరంగల్ బార్ అసోసియేషన్ బాధ్యుడు వలస సుధీర్, న్యాయవాది జనార్దన్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, బాధ్యులు గోవర్ధన్, మునిగాల పద్మ, వేణు, రాజేంద్రప్రసాద్, మొహినొద్దీన్, కేఎంసీ పీజీ డాక్టర్లు మహేష్‌కుమార్, జోత్స్న, రూబీ ఖాన్, అనాటమీ విభాగం సిబ్బంది ప్రేమ్‌కుమార్, యాదగిరి, ప్రణయ్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పార్థివ దేహాన్ని కేఎంసీ అనాటమీ విభాగం సిబ్బందికి అప్పగిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

మంత్రికి స్వాగతం పలికిన కలెక్టర్



న్యూశాయంపేట: బాలసముద్రంలోని అంబేడ్కర్‌నగర్‌లో రెండు పడక గదుల ఇళ్ల ప్రారంభోత్సవానికి శుక్రవారం విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.

గంజాయి తాగుతున్న ఇద్దరి అరెస్ట్

మడికొండ: గంజాయి తాగుతున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు మడికొండ పోలీసులు తెలిపారు. మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని వెస్ట్‌సిటీ పోచమ్మ గుడి వద్ద బస్కె వంశీ, నల్లాల భాస్కర్ గంజాయి తాగుతుండగా ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 50గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలి



ఖిలా వరంగల్: నగరవాసులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ ఉర్సు గుట్ట సీపీఎం కార్యాలయంలో సింగారపు బాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో నాగయ్య మాట్లాడారు. ప్రజలు తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాల సమస్యలతో పాటు కుక్కలు, కోతుల బెడదతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో సమస్యలపై పలు కాలనీల్లో సర్వే చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య, రత్నమాల, అరూరి కుమార్, బషీర్, దుర్గయ్య, ప్రశాంత్, సాంబమూర్తి, వెంకన్న ప్రభాకర్, వాణి, తదితరులు పాల్గొన్నారు.

క్విట్ ఇండియా డేను జయప్రదం చేయండి



ఖిలా వరంగల్: ఈ నెల 13న వరంగల్ చౌరస్తా జరగనున్న కార్పొరేట్ క్విట్ ఇండియా డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కిసాన్ మోర్చా ఎస్‌కేయూ జిల్లా నాయకుడు సోమిడి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 83వ క్విట్ ఇండియా వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ అబ్బనికుంటలోని తెలంగాణ రైతు సంఘం భవనంలో ఓదెల రాజయ్య, కిసాన్‌మోర్చా ఎస్‌కే జిల్లా నేత రాచర్ల బాలరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రపంచంలో ఏ దేశంతోనైనా అతి తక్కువ ధరకు చమురు కొనుగోలు చేసే హక్కు భారత్‌కు ఉంటుందని గుర్తుచేశారు. అమెరికా ప్రభుత్వంతో మోదీ ప్రభుత్వం ద్వైపాక్షిక చర్చలు జరిపి ట్రంప్ ప్రభుత్వానికి లొంగిపోయే ప్రమాద సూచికలు కనబడుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు వల్లందాస్ కుమార్, ఐత నగేష్, జక్కుల తిరుపతి, ఇనుముల కృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు నిర్ణయం సరికాదు



హన్మకొండ: బిహార్‌లో ఓట్ల తొలగింపుపై ఎన్నికల సంఘం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహార్ రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో 65 లక్షల ఓటర్లను జాబితా నుంచి ఎన్నికల కమిషన్ తొలగించిందని తెలిపారు. ఇలాంటి కుట్రకు తెరలేపిన బీజేపీ ప్రభుత్వ విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఓటమి భయంతోనే ఓట్లను తొలగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చుక్కయ్య, రాగుల రమేష్, వాంకుడోతు వీరన్న, జి.రాములు, దొగ్గెల తిరుపతి, లింగన్న, ఎల్.దీప, భాను నాయక్, నాయకులు ఓరుగంటి సాంబయ్య, నోముల కిశోర్, రమ, కారు ఉపేందర్, మంద మల్లేశం, యాకయ్య, శ్రీకాంత్, కళ్యాణ్, సుదర్శన్, రమేష్ పాల్గొన్నారు.

బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలి

ఖిలా వరంగల్: బీసీల వాటా బీసీలకు దక్కేవరకూ బీసీలంతా ఐక్యంగా ఉద్యమిద్దామని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి సూచించారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో వామపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి అన్ని రంగాల్లో బీసీల వాటా బీసీలకు దక్కే వరకు, తమ హక్కుల సాధనకు అందరూ పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల పార్టీల నాయకులు మేకల రవి, పనాస ప్రసాద్, ఈసంపల్లి బాబు, మాలోతు సాగర్, గంగుల దయాకర్, బండి కోటేశ్వర్, యాదగిరి, డాక్టర్ చందా మల్లయ్య, వీరస్వామి, కేడల ప్రసాద్, చింతం ప్రవీణ్‌కుమార్, సువర్ణ, చీకటి ప్రకాశ్, రమేష్, రజని, దివ్య, వెంకన్న, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే సైబర్ మోసాల కట్టడి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఖిలా వరంగల్: గంజాయి, మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అవగాహన ఉంటేనే కట్టడి చేయొచ్చని మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ సూచించారు. ఈ మేరకు వరంగల్ ఉర్సుగుట్ట సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అత్యాశతో చాలా మంది విద్యావంతులు సైబర్ నేరగాళ్ల వలలో పడుతున్నారని చెప్పారు. తాము బ్యాంకు అధికారులం, పోలీసులం అంటూ ఎవరైనా ఫోన్ చేస్తే నమ్మొద్దని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్‌కుమార్, ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ భార్గవి, అధ్యాపకులు, పోలీస్ జాగృతి ఏఎస్సై నాగమణి, హెడ్ కానిస్టేబుల్ ఉమెన్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రావణ మాస శుక్రవారం పూజలు



మెట్టుగుట్టపై కుంకుమార్చన చేస్తున్న మహిళలు



కాజీపేట శ్వేతార్క ఆలయంలో వరలక్ష్మి వ్రతం



హసన్‌పర్తి: వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు

మడికొండ: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలో పలు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంపై ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో శుక్రవారం అభిషేకం నిర్వహించారు. అనంతరం, 64 వడివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి ఆధ్వర్యంలో కుంకుమార్చన నిర్వహించారు. శివాలయ కార్య నిర్వహణాధికారి ఆర్.సునీత, రామాలయ కార్య నిర్వహణాధికారి సత్యనారాయణ, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో..

కాజీపేట: శ్వేతార్క మూల గణపతి దేవాలయం ఆవరణలోని మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపించారు. భక్తులతో సాయికృష్ణశర్మ అష్టోత్తర పూజలు చేయించారు. వరలక్ష్మి వ్రతం చేయడం వల్ల కలిగే ఫలితాలను భక్తులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ వివరించారు.

హసన్‌పర్తిలో సామూహిక వరలక్ష్మి వ్రతం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. పలు కాలనీలకు చెందిన భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, కందుకూరి శేషవేణి, చకిలం సులోచన, సంద్రు నిరోష, గుండమీది విజయ, తోట వసంత, గౌరిశెట్టి రాజేశ్వరి, ఉప్పుల సుగుణ, ధనలక్ష్మి, పాపిశెట్టి విశ్వశ్రీ, తదితరులు పాల్గొన్నారు.